సాక్షి
రంగారెడ్డి
మంగళవారం : 26 : మార్చి : 2024



మొయినాబాద్: ఓ రిసార్ట్‌లో జరిగిన ఈవెంట్‌లో రంగులు చల్లుకుంటూ..

రంజాన్ వేళలు

ఇఫ్తార్ :	సహర్ :
మంగళవారం సాయంత్రం 6:34	బుధవారం ఉదయం 4:53



హుడాకాంప్లెక్స్: హోలీ ఆడుతున్న చిన్నారి



జాయ్ ఆఫ్ కలర్స్

ఆమనగల్లు: శ్రీకర యోగా కేంద్రంలో హోలీ సంబరాలు

జిల్లా వ్యాప్తంగా హోలీ సంబరాలు అంబరాన్నంటాయి.. ఆదివారం రాత్రి కాముని దహనం నిర్వహించారు. సోమవారం చిన్నా పెద్దా తేడా లేకుండా రంగుల్లో మునిగితేలారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. కొన్నిచోట్ల బ్యాండ్ మేళాలు, డీజే సౌండ్‌ల మధ్య యువత నృత్యాలు చేస్తూ కేరింతలు కొట్టారు. ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు.



షాద్‌నగర్: న్యూసిటీ కాలనీలో హోలీ సంబరాలు



చేవెళ్ల: మిర్జాగూడలో రంగులతో చిన్నారులు

న్యూస్‌రీల్

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



నోటిఫికేషన్ పత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రాంతీయ సమన్వయ అధికారి విద్యుల్లత

షాద్‌నగర్: పట్టణ శివారులోని నూర్ ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో కొనసాగుతున్న నాగర్‌కర్నూల్ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రాంతీయ సమన్వయ అధికారి విద్యుల్లత తెలిపారు. ఆసక్తి గల విద్యార్థినులు ఏప్రిల్ 12వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఇంటర్ పాసైన వారు దరఖాస్తు చేసుకోవాలని, ప్రవేశ పరీక్ష ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థినులకు కావాల్సిన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సుజాత తెలిపారు.

రేపు జాబ్ మేళా

ఇబ్రహీంపట్నం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఉదయం 10 గంటల నుంచి జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రభు తెలిపారు.నవత రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంయుక్తంగా ఈ మేళా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఇంటర్ పాసైన వారితోపాటు డిగ్రీ ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు తమ విద్యార్హతతో పాటు ఇతర ధ్రువపత్రాలతో హాజరుకావాలని తెలిపారు.రిజిస్ట్రేషన్, ఇతర వివరాలకు 9100 2 05245, 90109 12527, 93810 65920 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

28న ఓయూ వార్షిక బడ్జెట్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ వార్షిక బడ్జెట్–2024ను ఈ నెల 28న సెనేట్ సమావేశంలో ప్రవేశపెట్టనున్నారు. ఆదాయం తగ్గి.. వ్యయం పెరిగిన తరుణంలో నిధుల కోసం ప్రభుత్వంపై ఆధారపడాల్సి వస్తోందని వర్సిటీ అధికారులు పేర్కొన్నారు. ప్రభుత్వం రూ.500 కోట్లు కేటాయించినప్పటికీ వేతనాలు, పింఛన్‌కు సరిపోవడం లేదన్నారు. ఆర్థిక సమస్యలు ఎదుర్కొనేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

'మండే' ఎండలు

సాక్షి, సిటీబ్యూరో: ఎండలు మండుతున్నాయి. నాలుగు రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే నాలుగైదు డిగ్రీలు అధికంగా నమోదయ్యాయి. ఉదయం పది తర్వాత బయటకు వెళ్లేందుకు జనం జంకుతున్నారు. శుక్రవారం సగటున గరిష్ట ఉష్ణోగ్రత 37.6, కనిష్ట ఉష్ణోగ్రత 29.3 డిగ్రీలుగా నమోదైంది. అత్యధికంగా షేక్‌పేటలో 39.2 డిగ్రీలు నమోదు కాగా శివారులో మరింత పెరిగింది. ఇబ్రహీంపట్నంలో 39.6, మొయినాబాద్‌లో 39.6, బజార్‌ఘాట్‌లో 39.1, పాటిగడ్డలో 39.0, ఆసిఫ్‌నగర్‌లో 38.8, చార్మినార్‌లో 38.7, సరూర్‌నగర్‌లో, సైదాబాద్‌లో 38.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఇస్తే సరి.. లేదంటే కొర్రీ!

భూ రిజిస్ట్రేషన్లలో అక్రమ వసూళ్లు

- భూ స్వభావం, ప్రాంతం ప్రకారం రేటు
- సమర్పించుకుంటున్న క్రయవిక్రయదారులు
- మధ్యవర్తులుగా డాక్యుమెంట్ రైటర్లు
- పట్టించుకోని ఉన్నతాధికారులు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: రెవెన్యూ వ్యవస్థలో పేరుకుపోయిన అవినీతిని పూర్తిగా రూపుమాపాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆన్‌లైన్ విధానానికి శ్రీకారం చుట్టింది. వెంచర్లలోని ఖాళీ స్థలాలు, ఇళ్లే కాదు వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లకు ఆన్‌లైన్ విధానం తీసుకొచ్చింది. వెంచర్లలోని ప్లాట్లు, ఇళ్లను స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ విభాగంలో రిజిస్ట్రేషన్ చేస్తుంటే.. వ్యవసాయ భూములను తహసీల్దార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. ఆయా శాఖల్లో పని చేస్తున్న కొంతమంది అధికారులు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. డాక్యుమెంట్ రైటర్లతో కుమ్మక్కై.. భూముల రిజిస్ట్రేషన్‌ను బట్టి ధరలు నిర్ణయించి, వసూలు చేస్తున్నారు. క్రయ విక్రయాల సమయంలో కిరికిరి చేసే అవకాశం ఉండటంతో విక్రయదారులే కాదు కొనుగోలుదారులు సైతం వారు అడిగినంత ఇచ్చి భూములు రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారు. ఎప్పటికప్పుడు ఆయా మండలాల్లో పర్యటించి, తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాల్లో పేరుక పోయిన ఫైళ్లపై ఆరా తీయాల్సిన ఉన్నతాధికారులు పట్టనట్లుగా వ్యవహరిస్తుండటంతో అక్రమార్కుల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది.

దాక్యుమెంట్ల సంఖ్యను బట్టీ..

వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లకు ముందస్తుగా ధరణి పోర్టల్‌లో స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంది. కొనుగోలుదారులు ఆ భూమికి నిర్దేశిత ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుక్ చేసుకుంటున్నారు. ఆ భూమిపై ఏదైనా కేసు, ఇతర అభ్యంతరాలుంటే స్లాట్ బుక్ కాదు. అధికారికంగా స్లాట్ బుక్ అయిన వారి నుంచి అక్రమ వసూళ్లు చేస్తున్నారు. జిల్లాలో 27 మండలాలు ఉండగా, వీటిలో ఏడు మినహా మిగిలిన వాటిలో వ్యవసాయ భూ రిజిస్ట్రేషన్లు ఎక్కువ జరుగుతున్నాయి. ఒక్కో తహసీల్దార్ ఆఫీసులో రోజుకు సగటున 30 నుంచి 40 వరకు రిజిస్ట్రేషన్లు అవుతుంటాయి. వెంచర్లలోని ఖాళీ ప్లాట్లకు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఆఫీసుల్లో రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. ఒక్కో ఆఫీసులోరోజుకు సగటున 50–60 వరకు రిజిస్ట్రేషన్లు పూర్తవుతాయి. ఇలా జిల్లా వ్యాప్తంగా ఈ రెండు విభాగాల్లో రోజుకు సగటున 1,500 నుంచి 2,000 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ అవుతున్నట్లు అంచనా. భూ స్వభావం, ప్రాంతాన్ని బట్టి రిజిస్ట్రేషన్లకు ధరలు నిర్ణయిస్తున్నారు. డాక్యుమెంట్ రైటర్లు వీరికి మధ్య వర్తులుగా వ్యవహరిస్తున్నారు. వారు రైతుల నుంచి ముందే డబ్బులు వసూలు చేసి, సదరు రిజిస్ట్రేషన్ ఫైలు తీసుకెళ్లి తహసీల్దార్ ముందు పెడుతున్నారు. ఆయన డాక్యుమెంట్‌పై పెన్సిల్‌తో ఓ మూలన అర్థంకానీ పదాలు (కోడ్ లాంగ్వేజ్) రాసి పెడుతున్నారు. ఆ రోజు ఎన్ని రిజిస్ట్రేషన్లు అయ్యాయి? ఏ డాక్యుమెంట్ రైటర్ నుంచి ఎన్ని వచ్చాయి? వంటి వాటిని లెక్కించి, వారి నుంచి వసూలు చేసుకుని వెళ్తుండటం విశేషం. ఎప్పటికప్పుడు ఆయా రెవెన్యూ కార్యాలయాల్లో తనిఖీలు నిర్వహించి, అక్రమార్కులపై గట్టి నిఘా ఏర్పాటు చేయాల్సిన ఉన్నతాధికారులు అటు వైపు చూడటం లేదు.

పార్టిషియన్ డీడ్ అంటే పండుగే..

ఏ వివాదం లేని పట్టా భూములు రిజిస్ట్రేషన్ (సేల్‌డీడ్)కు తహసీల్దార్‌కు రూ.1000 ధరణి ఆపరేటర్‌కు రూ.500, అటెండర్(స్టాంప్) రూ.200–500 వరకు చెల్లించుకోవాల్సి వస్తుంది. వారసత్వంగా లభించిన పట్టా భూములను తమ పిల్లలకు తల్లిదండ్రులు చేసే గిఫ్ట్ డీడ్ రిజిస్ట్రేషన్‌కు తహసీల్దార్‌కు ఎకరానికి రూ.2,500 చెల్లించాల్సి వస్తోంది. అదే వారసత్వంగా వచ్చిన పట్టా భూములను తల్లిదండ్రుల నుంచి అన్నదమ్ములు ముందే ఒక ఒప్పందా నికి వచ్చి చేసుకునే పార్టిషియన్ డీడ్ రిజిస్ట్రేషన్‌కు ఎకరానికి ఏకంగా రూ.5000 వసూలు చేస్తున్నారు. ఇక బ్యాంకుల్లో పంట రుణాలు, అసైన్డ్, భూదాన్, లావణ్య పట్టా భూముల రిజిస్ట్రేషన్లకు మార్కెట్ విలువను బట్టి ఎకరానికి రూ. 50,000 నుంచి రూ.లక్ష వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. డాక్యుమెంట్ రైటర్లు ముందే ఓ ధర నిర్ణయించి, భూ యజమానులకు చెప్పేస్తున్నారు. ఇవ్వకపోతే ఏ భూమికి ఎలాంటి కొర్రీలు పెడుతున్నారో కూడా ముందే వివరిస్తున్నారు. తీరా క్రయవిక్రయాల సమయంలో ఎందుకొచ్చిన గొడవ అని ఆయా భూ యజమానులు వారు అడిగినంత సమర్పించుకుని వెళ్లిపోతున్నారు.

అక్రమార్కులపై ఏసీబీ కన్ను

జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేస్తున్న అధికారులు, సిబ్బందిపై ఏసీబీ దృష్టి సారించింది. గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఆర్ఐలు, డిప్యూటీ తహసీల్దార్లు, తహసీల్దార్లు, మున్సిపాలిటీల్లోని టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్లు, బిల్ కలెక్టర్ల అవినీతి చిట్టాను లెక్కిస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఇప్పటికే ఆదాయానికి మించి ఆస్తులు కూడాబెట్టిన అధికారులపై దాడులు చేసిన అధికారులు.. తాజాగా అక్రమార్కులను పట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు. ముఖ్యంగా మహేశ్వరం నియోజకవర్గంలో అక్రమార్కులు ఎక్కువగా ఉన్నట్లు, వీరిని పట్టిస్తే.. సొంతట్రస్ట్ నుంచి రూ.లక్ష బహుమానం ఇవ్వనున్నట్లు ఏకంగా అధికార పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ ప్రకటించడం కొసమెరుపు.

'కంచర్ల'కు భువనగిరి టికెట్ ఇవ్వాలి

- ఇబ్రహీంపట్నంలో అల్లు అర్జున్ ఫ్యాన్స్ బైక్ ర్యాలీ



కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి చిత్రపటాలతో కూడిన టీషర్టులు ధరించి బైక్ ర్యాలీ

ఇబ్రహీంపట్నం: కాంగ్రెస్ పార్టీ భువనగిరి లోక్‌సభ టికెట్‌ను కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డికి ఇవ్వాలని కోరుతూ సినీ హీరో అల్లు అర్జున్ అభిమానులు సోమవారం ఇబ్రహీంపట్నంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. చంద్రశేఖర్‌రెడ్డి ఫొటోలతో ముద్రించిన టీషర్టులు ధరించి ర్యాలీలో పాల్గొన్నారు. చంద్రశేఖర్‌రెడ్డి కూతురును అల్లు అర్జున్‌కు ఇవ్వడం, ఇబ్రహీంపట్నం పరిధిలో అతనికి విద్యాసంస్థలు ఉండటం తెలిసిందే. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్ఎస్ తరఫున ఇబ్రహీంపట్నం నుంచి పోటీచేసిన చంద్రశేఖర్‌రెడ్డి ఓటమి పాలయ్యారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. తన ఫౌండేషన్ ద్వారా ప్రజలకు సేవలు చేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డికి అవకాశం ఇవ్వాలని అభిమానులు శరత్, సాయికుమార్, వంశీ, అనిల్ తదితరులు కోరారు.

బంపర్ ఆఫర్

- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీకి ఈనెల 28న ఎన్నిక
- ఎలాగైనా విజయం సాధించాలని అభ్యర్థుల వ్యూహాలు
- స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను మచ్చిక చేసుకునే పనిలో నిమగ్నం
- ఆఫర్లతోపాటు కుటుంబ సభ్యులతో కలిసి విహారయాత్రలు



ఆమనగల్లు: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ప్రజాప్రతినిధులకు బంపర్ ఆఫర్ తగిలింది. ఎమ్మెల్సీ ఎన్నిక ఈనెల 28న జరగనుంది. ఈ నేపథ్యంలో పోటీలో ఉన్న కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు విజయం కోసం వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే తమ పార్టీల ప్రజాప్రతినిధులు చేజారకుండా వారికి బంపర్ ఆఫర్ ఇవ్వడంతో పాటు కుటుంబ సభ్యులతో కలిసి విహారయాత్రలకు పంపించారు. జిల్లాలో స్థానిక సంస్థల్లో పోటీచేసిన పలువురు పెద్ద మొత్తంలో ఖర్చుచేసి ప్రజాప్రతినిధులుగా ఎన్నికయ్యారు. గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనులు చేసినప్పటికీ సరిగా బిల్లులు రాక పలువురు ఇబ్బంది పడ్డారు. ఈ నేపథ్యంలో రెండేళ్ల క్రితం స్థానిక సంస్థల ఎన్నికలు రావడంతో తమకు ఆర్థికంగా కలిసివస్తుందని భావించినప్పటికీ అప్పట్లో కసిరెడ్డి నారాయణరెడ్డి, దామోదర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీంతో వారి ఆశలు అడియాసలయ్యాయి. ఈ నేపథ్యంలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్‌అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించడంతో ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. దీంతో ఎమ్మెల్సీ ఎన్నికలకు ఈనెల 28న ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఎన్నికల సంఘం ప్రకటించడంతో మళ్లీ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల్లో కొంత ఉత్సాహం కనిపించింది. ఎలాగైనా ఎమ్మెల్సీ స్థానాన్ని దక్కించుకోవడానికి కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో మాట్లాడి క్యాంపులకు తరలించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులతో పాటు బీజేపీకి చెందిన ప్రజాప్రతినిధులను సైతం కలిసి ఆఫర్ ఇచ్చినట్టు సమాచారం. చాలామంది ఇరు పార్టీల అభ్యర్థులతో టచ్‌లో ఉండడం విశేషం. ఆమనగల్లుకు చెందిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు కుటుంబ సభ్యులతో కలిసి ఇప్పటికే గోవా వెళ్లారు. క్యాంపులకు తరలివెళ్లిన ప్రజాప్రతినిధులు నేరుగా 28న జరిగే పోలింగ్‌కు రానున్నట్టు తెలుస్తోంది.

హైదరాబాద్ బరిలో 'గడ్డం'

శ్రీనివాస్‌యాదవ్‌ను ఖరారు చేసిన బీఆర్ఎస్ అధిష్టానం

అబిడ్స్: హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా గడ్డం శ్రీనివాస్‌యాదవ్‌ను మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు ప్రకటించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో గోషామహల్ నుంచి టికెట్ ఆశించి భంగపడ్డారు శ్రీనివాస్‌యాదవ్. ఈసారి హైదరాబాద్ ఎంపీ అభ్యర్థిగా ఎంపిక చేయడంతో కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం గోషామహల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడిగా శ్రీనివాస్‌యాదవ్ కొనసాగుతున్నారు. 1989లో విద్యార్థి దశలోనే రాజకీయాలకు ఆకర్షితుడై ఎన్ఎస్‌యూఐలో చేరి నగర, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, ఆలిండియా కార్యదర్శిగా కొనసాగారు. క్యాంపస్ ఇన్‌చార్జిగా, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఆలిండియా యువజన కాంగ్రెస్ కార్యదర్శిగా పనిచేశారు. 2006లో నగర గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నియమితులై 2011 సంవత్సరం వరకు కొనసాగారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత 2015లో టీఆర్ఎస్ పార్టీలో చేరారు. తన తండ్రి గంగాధర్ యాదవ్ పేరిట ఫౌండేషన్ ఏర్పాటు చేసిన అనేక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. కరోనా సమయంలోనూ వేలాది కుటుంబాలకు నిత్యావసర సరుకుల కిట్లు పంపిణీ చేశారు.

ప్రొఫైల్:



పేరు: గడ్డం శ్రీనివాస్ యాదవ్
వయస్సు: 56
విద్యార్హతలు: బీ.కాం.
కుటుంబం: భార్య స్వర్ణలత, కుమార్తె డాక్టర్ స్నేహ, కుమారుడు గగన్‌యాదవ్.
వృత్తి: విద్యా సంస్థల నిర్వహణ, హైందవి గ్రూప్ ఆఫ్ కాలేజీలకు చైర్మన్, శ్రీహిందూ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్

ప్రతిఒక్కరూ ధర్మాన్ని ఆచరించాలి

శ్రీ వ్యాసాశ్రమ పీఠాధిపతి పరిపూర్ణానందస్వామి

- సనాతన వేదాంత జ్ఞానసభలు ప్రారంభం
- వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన పీఠాధిపతులు



సభలో ప్రసంగిస్తున్న వ్యాసాశ్రమ పీఠాధిపతి పరిపూర్ణానందస్వామి

బడంగ్‌పేట్: మానవులు ధర్మబద్ధులుగా మెలగాలని, ధర్మాన్ని కాపాడితే అది మనల్ని కాపాడుతుందని శ్రీవ్యాసాశ్రమ పీఠాధిపతి శ్రీశ్రీ పరిపూర్ణానంద స్వామి బోధించారు. జనన, మరణాలు లేని పరబ్రహ్మన్ని తెలుసుకోవడమే సనాతన ధర్మమని తెలిపారు. బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్ ఎస్వీఆర్ గార్డెన్‌లో 98వ సనాతన వేదాంత జ్ఞానసభలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పరిపూర్ణానందస్వామి మాట్లాడుతూ.. ధర్మక్షేత్రే.. కురుక్షేత్రే అనే పదాలతో గీత ప్రారంభమైందని, ప్రతిఒక్కరూ ధర్మాన్ని ఆచరించాలని కోరారు. తల్లిదండ్రులు, గురువు, భగవంతుడి సేవలో తరించాలన్నారు. యజ్ఞాలు, దాన ధర్మాలు మానవుల విధి అని, అందరూ తప్పక ఆచరించాలని సూచించారు. సభలో భగవద్గీత ఆరు అధ్యాయాలు పారాయణం చేశారు. వాటి సారాంశాన్ని భక్తులకు వివరించారు. అనంతరం పలువురు పీఠాధిపతులు ఉపన్యసించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన పీఠాధిపతులు, మఠాధిపతులు ఆధ్యాత్మిక వేడుకలో పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఉదయం కుబేర యజ్ఞం చేశారు. అనంతరం శ్రీనివాస్, సుప్రియ దంపతులు శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన మాజీ డీజీపీ అరవింద్‌రావును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీ పరమాత్మానందగిరి స్వామి, శ్రీ శుద్ధ చైతన్యానందగిరి స్వామి, అసంగానందగిరి స్వామి, విశ్రాంత ఆంధ్రోపన్యాసకులు డా.కసిరెడ్డి వెంకటరెడ్డి, కవయిత్రి బొప్పన అరుణాదేవి, ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు లక్ష్మణ్‌గుప్తా, కన్వీనర్ పాండు గుప్తా, మీడియా కన్వీనర్ కె.వెంకటేశ్ పాల్గొన్నారు.



శివపార్వతుల కల్యాణం

ట్యాంకర్ మీది.. నీళ్లు మావి

- వాణిజ్య అవసరాల కోసం జలమండలి కొత్త ప్లాన్
- ముందస్తు బుకింగ్ కోసం దరఖాస్తు తప్పనిసరి

బంజారాహిల్స్: కమర్షియల్ వాటర్ ట్యాంకర్లు లేక జలమండలిలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈక్రమంలో వాణిజ్య అవసరాల కోసం నీళ్ల ట్యాంకర్ బుక్ చేసుకుంటే రెండు మూడు రోజుల వరకు అందని పరిస్థితి. దీంతో హోటళ్లు, ఆస్పత్రులు, సినిమా థియేటర్లు, మాల్స్, ఇతర బడా కంపెనీలు సతమతమవుతున్నాయి. అయితే, ఇలాంటి ప్రతికూల పరిస్థితిని అధిగమించేందుకు జలమండలి అధికారులు సరికొత్త ప్రణాళిక రూపొందించారు. ఇందుకోసం.. నీటి అవసరం ఉన్న వాణిజ్య సంస్థలు సొంతంగా కమర్షియల్ వాటర్ ట్యాంకర్‌ను సమకూర్చుకుంటే ప్రతిరోజు నీరు అందిస్తామంటున్నారు. మూడో షిఫ్టులో అంటే ప్రతిరోజు రాత్రి 10 నుంచి తర్వాతి రోజు ఉదయం 6 గంటల వరకు నీటి సరఫరా చేస్తామంటున్నారు. నీటి సరఫరా కోసం వాణిజ్య సంస్థలు ముందుగా స్థానిక జల మండలి సెక్షన్ మేనేజర్లు, డీజీఎంలు, జీఎంలతో పాటు ఇతర అధికారులకు దరఖాస్తు చేసుకోవాలి.

'మత్తు' వదిలించారు

- నిషేధిత మత్తుపదార్థాలు తరలిస్తున్న ముఠా గుట్టురట్టు
- రూ.13లక్షల విలువైన కిలో ఆల్ఫాజోలం, కారు స్వాధీనం
- ముగ్గురు నిందితుల అరెస్ట్


అనిల్‌గౌడ్


సుధాకర్


శరత్‌బాబు

కొత్తూరు: నిషేధిత మత్తుపదార్థం ఆల్ఫాజోలం తరలిస్తున్న ముఠా గుట్టు రట్టయింది. శంషాబాద్ ఎస్‌ఓటీ పోలీసులు సోమవారం వారిని మండల కేంద్రంలో చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. సీఐ నర్సింహారావు తెలిపిన ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం వెల్కిచర్లకు చెందిన అనిల్ గౌడ్(32), నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం నేరళ్లపల్లికి చెందిన శరత్ బాబు(30), మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని టీచర్స్ కాలనీకి చెందిన సుధాకర్ ఏడాది కిత్రం ముఠాగా ఏర్పడ్డారు. ఈ ముఠా నాగర్‌కర్నూల్‌కు చెందిన నర్సింహులు నుంచి ఆల్ఫాజోలం సేకరిస్తున్నారు. దీన్ని జిల్లాలలోని కల్లు దుకాణాలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ కల్లు సేవిస్తున్న ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారనే కారణంగా ప్రభుత్వం నిషేధించింది. ఉదయం పట్టణ స మీపంలోని పాత జాతీయ రహదారి విజయలక్ష్మి కూ డలీ వద్ద వీరి వాహనాన్ని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా ఆల్ఫాజోలం తరలిస్తున్న విషయం బట్టబయలైంది. వెంటనే వారిని అరెస్ట్ చేసి సుమారు రూ..13 లక్షల విలువైన 1,030 గ్రాముల ఆల్ఫాజోలం, కారు, మూడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. కేసు దర్యాప్తులో ఉంది.

వ్యక్తి బలవన్మరణం


ఆంజనేయులు (ఫైల్)

షాద్‌నగర్: భార్య డబ్బు అడిగితే ఇవ్వలేదని మనస్తాపం చెందిన ఓ వ్యక్తి రైలు కింద పడి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని లింగారెడ్డిగూడ శివారులో చోటు చేసుకుంది. కేశంపేట మండలం అవాజీమియా పడకల్ గ్రామానికి చెందిన వారణాసి ఆంజనేయు లు (45) ఆదివారం ఉదయం తన భార్యను ఖర్చుకు డబ్బులు అడిగాడు. ఆమె నిరాకరించడంతో మనస్తాపానికి చెందిన గుర్రైన ఆంజనేయులు గ్రామ శివారుకు వచ్చి సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. లోకో పైలెట్ రఘురాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

తీసుకోవాలా.. వద్దా?


నస్దిక్‌సింగారంలో ఓంకారేశ్వరాలయ భూమిలో సాగు చేసిన పంట


ఆలయంలో కొలువైన స్వామివారు

- కౌలు వసూలుపై స్పష్టత కరువు
- ఇటీవలే దేవాదాయ ధర్మాదాయశాఖకు ఆలయ ఈఓ లేఖ
- పట్టాదారు పాసు పుస్తకాల కోసం రైతుల డిమాండ్
- హైకోర్టు పరిధిలో కేసు

యాచారం: నందివనపర్తి ఓంకారేశ్వరాలయ భూముల కౌలు బకాయిల వసూలుపై సందిగ్ధత నెలకొంది. ఈ ఆలయానికి 1,452 ఎకరాల భూమి ఉంది. ఇందులో 1,252 ఎకరాల భూమి సాగుకు యోగ్యమైంది. మరో 200 ఎకరాలు గుట్టలు, రాళ్లు, రప్పలతో ఉంది. ఈ భూమిని నందివనపర్తి గ్రామంతో పాటు నస్దిక్‌సింగారం, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాలకు చెందిన 500కు పైగా కుటుంబాల రైతులు సాగు చేసుకుని జీవనోపాధి పొందుతున్నారు. 2017కు ముందు ఓంకారేశ్వరాలయ భూముల్లో కౌలు రైతుల పేర్లు పహనీల్లో ఉండేవి. ప్రభుత్వం ధరణి పోర్టల్ తీసుకువచ్చిన తర్వాత ఈ భూములు ఓంకారేశ్వరుడి పేరు మీదే నమోదు చేశారు. దీంతో కౌలు రైతుల్లో ఆగ్రహం వ్యక్తం చేశారు. 75 ఏళ్లకు పైగా ఆలయ భూములను సాగు చేసుకుని జీవనోపాధి పొందుతున్నాం, ఏళ్ల పాటు పహనీల్లో తమ పేర్లున్నాయి. పాత రికార్డుల ప్రకారం తమ పేరిట పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ భూముల క్రయ, విక్రయాలకు తమకు వెసులుబాటు కల్పించాలని కోరుతున్నారు.

ఉత్సవాలకు డబ్బు కొరత

ధరణి పోర్టల్‌లో ఆలయ ఓంకారేశ్వరుడి పేరు నమోదు చేయడంతో రైతులు నాలుగేళ్లుగా కౌలు చెల్లింపులు నిలిపేశారు. గత నాలుగేళ్లతో పాటు అంతకు ముందు పాత బకాయిలు కలుపుకొని దాదాపు రూ.10 లక్షలకు పైగా కౌలు బకాయిలున్నాయి. ఆ లయ భూమిని సాగు చేసుకుని జీవనోపాధి పొందుతూ ప్రతి యేటా చెల్లించే కౌలు డబ్బుతోనే ఓంకారేశ్వరుడి కల్యాణోత్సవాలు, నిత్య పూజలు నిర్వహించాలన్నది దేవాదాయ, ధర్మాదాయ శాఖ నిర్ణయం. కానీ ఓంకారేశ్వరుడికి మాత్రం పూజలు, ఉత్సవాలకు మాత్రం నిత్యం డబ్బు కొరతే ఉంటోంది.

సమాధానం వస్తేనే స్పష్టత

ఓంకారేశ్వరుడి ఆలయ భూముల్లో సాగు చేసుకుని జీవనోపాధి పొందుతున్న రైతుల నుంచి కౌలు వసూలు చేసే విషయంలో సందిగ్ధత నెలకొంది. కేసీఆర్ సర్కార్ హయాంలో ఆలయానికి చెందిన సర్వే నంబరు 163, 190, 211, 212 తదితర సర్వే నంబర్లల్లో 1,026 ఎకరాల భూమిని ఫార్మాసిటీకి సేకరించాలని నిర్ణయించింది. 1,026 ఎకరాల ఆలయ భూమిని ఫార్మాసిటీకి ఇవ్వాలని టీఎస్‌ఐఐసీ దేవాదాయ, ధర్మాదాయ శాఖను కోరింది. దేవాదాయ, ధర్మాదాయ శాఖ సైతం సమ్మతించింది. ఈ విషయం కౌలు రైతులకు చెప్పడంతో వారు హైకోర్టును ఆశ్రయించారు. రాష్ట్ర హైకోర్టు సైతం దేవాదాయ, ధర్మాదాయ శాఖపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ వ్యవహారం హైకోర్టు పరిధిలో ఉండడంతో కౌలు వసూల్ చేయాలా..? లేదా ఓంకారేశ్వరాలయ ఈఓ ప్రవీణ్‌కుమార్ దేవాదాయ, ధర్మాదాయ కమిషనర్‌కు ఇటీవలే లేఖ రాసారు. కమిషనర్ నుంచి సమాధానం వస్తేనే అధికారులకు స్పష్టత రానుంది.

ఆ భూమే బతుకుదెరువు



కౌలు వసూల్ కాదు. ఏళ్లుగా ఆలయ భూమిని సాగు చేసుకుని జీవనోపాధి పొందుతున్నాం. తమ కుటుంబ సభ్యులు ఎనిమిది ఎకరాలకు పైగా భూమిని సాగు చేసుకుని జీవనోపాధి పొందుతున్నాం. ఆ భూమి లేకుంటే మాకు బతుకుదెరువే లేదు. కౌలు డబ్బులు చెల్లించేది లేదు. పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలి. ఎన్నికల ప్రచారంలో మల్‌రెడ్డి రంగారెడ్డి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఇప్పుడు ఆయనే గెలిచారు. మాకు న్యాయం చేయాలి.

– ఆదిరెడ్డి నర్సిరెడ్డి, కౌలు రైతు, నస్దిక్‌సింగారం



ఇసుక ట్రాక్టర్ సీజ్

కేశంపేట: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు ఆదివారం రాత్రి సీజ్ చేశారు. మండల పరిధిలోని కాకునూరు గ్రామానికి చెందిన కరికే సురేశ్‌కు చెందిన ట్రాక్టర్‌లో డ్రైవర్ రాములు వాగు నుంచి ఇసుక తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నరు. ఎటువంటి అనుమతి లేకపోవడం ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించారు. ఏఎస్‌ఐ నర్సింలు శెట్టి ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ యజమాని, డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ లింగం తెలిపారు.

కూలీ దుర్మరణం

చేవెళ్ల: డ్రైవర్ నిర్లక్ష్యంతో లేబర్ దుర్మరణం చెందాడు. ఈ ఘటన చేవెళ్ల పోలీ స్టేషన్ పరిధిలోని దేవుని ఎర్రవల్లి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ఛత్తీస్‌ఘఢ్‌కు చెందిన బామన్ పోయామి(19) మూడు నెలలుగా పట్టణంలోని శ్రీవెంకటేశ్వర్ బోర్‌వెల్స్ లారీపై పనిచేస్తున్నాడు. గ్రామానికి చెందిన ఓ రైతుకు బోరు వేసేందుకు వెళ్లారు. బోరు వేస్తుండగా బామన్ పోయామి పొలం వద్ద నిద్రకు ఉపక్రమించాడు. గమనించని డ్రైవర్ రవీందర్‌రెడ్డి బామన్‌పోయామి మీదుగా లారీని రివర్స్ తీశాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.

ప్రకటనల తొలగింపు

సాక్షి, సిటీబ్యూరో: లోక్‌సభ ఎన్నిక ల ప్రవర్తన నియమావళి అమలులో భాగంగా అనధికార ప్రకటనలను తొలగించేందుకు జీహెచ్‌ఎంసీ సిద్ధ మైంది. రాజకీయ నేతల ప్రచార హోర్డింగ్స్, ప్రభుత్వ సంక్షేమ, అభి వృద్ధి కార్యక్రమాల ప్రకటనలు ఎ ప్పటికప్పుడు తొలగించనుంది. ఎ న్నికల షెడ్యూలు వెలువడినప్పటి నుంచే ఈ కార్యక్రమం చేపట్టినా.. చాలా ప్రాంతాల్లో ఇప్పటికీ ప్రకట న బోర్డులు కనిపిస్తున్నాయి. వాటి తో పాటు కొత్తగా ఏర్పాటవుతున్న వాటిని ఎప్పటికప్పుడు తొలగించేందుకు చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. మూడు నెలల పాటు కొనసాగే ఈ కార్యక్రమ బాధ్యతని ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించేందుకు అధికారులు సిద్ధమయ్యారు.

క్యాం'పెయిన్'

ఎంపీ అభ్యర్థులను హడలెత్తిస్తున్న ప్రచార కార్యక్రమాలు

సాక్షి, సిటీబ్యూరో: పార్లమెంట్ ఎన్నికలు రాజకీయ పార్టీలను హడలెత్తిస్తున్నాయి. గెలుపోటములను పక్కనపెడితే.. మే 13వ తేదీ వరకు నిరంతరం ప్రచారం చేయాల్సి ఉండటంతో ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో కంగారు మొదలైంది. గతంలో జరిగిన పలు ఎన్నికల కంటే ఈసారి గడువు ఎక్కువ ఉండటంతో ప్రచార నిర్వహణ భారంగా మారనుంది. అభ్యర్థులు అనుచరులు, కార్యకర్తలతో 50 రోజుల పాటు ప్రజల్లో తిరగాల్సి ఉంటుంది. బహిరంగ సభలతో పాటు సమావేశాలు, ర్యాలీలతో ప్రచారాన్ని హోరెత్తించాలి. కార్యకర్తలను పోగుచేయడం మొదలు అంచెలంచెలుగా ప్రచారాన్ని ఉధృతం చేసేందుకు వ్యూహాత్మకంగా వ్యవహరించాలి. దీంతో పార్లమెంట్ ఎన్నికల బరిలోకి దిగే నాయకులను 'ప్రచార భారం' ఆందోళనకు గురి చేస్తోంది. గతంలో ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచీ ఎన్నిక తేదీ వరకు గరిష్ఠంగా 55 రోజులు ఉంటే.. ఈసారి 58 రోజుల గడువు ఉండటం గమనార్హం. రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచారాన్ని మే 11న అధికారికంగా ముగించాలి. కానీ, ఎన్నికలు జరుగనున్న 13వ తేదీ వరకు ఓటర్లను ప్రసన్నం చేసుకొనేందుకు వివిధ రకాలుగా ప్రచారం చేయాల్సిందే.

జనాల తరలింపు కష్టమే..

ఓ వైపను గడువు ఎక్కువ రోజులు ఉండటమే భారంగా భావిస్తున్న అభ్యర్థులకు.. ఎండలు చుక్కలు చూపనున్నాయి. దీంతో ప్రచారానికి, సభలకు జన సమీకరణ సవాలుగానే మారనుంది. మండుతున్న ఎండల దృష్ట్యా జనాన్ని తరలించడం ఈసారి ఇబ్బందిగా ఉంటుందని ప్రధాన పార్టీకి చెందిన ఒక నాయకుడు అభిప్రాయపడ్డారు. 'ప్రచారానికి జనాలను, కార్యకర్తలను తరలించడం ప్రధాన సమస్య. అభ్యర్థులు తమ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని ఓటర్లను కలవాలి. ఎన్నికల గడువు ఎక్కువగా ఉండటం వల్ల ఎక్కువసార్లు పర్యటించే పరిస్థితి కూడా ఉంటుంద'న్నారు.

యువకుడి ఆత్మహత్య

హస్తినాపురం: ఫ్యాన్‌కు ఉరేసుకుని ఓ హాస్టల్ విద్యార్థి ఆత్మహ త్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన వనస్థలిపురం ఠాణా పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌కు రాష్ట్రం, కందుకూరు మండలం, పందలపాడుకు చెందిన కిరణ్‌కుమార్(26) ప్రైవేటు ఉద్యోగి. ఆయన హస్తినాపురంలోని ఓ హాస్టల్‌లో ఉంటున్నాడు. ఆదివారం రాత్రి గదిలోకి వెళ్లిన అతను సోమవారం కూడా బయటికి రాకపోవడంతో పక్క గదిలో ఉండే యువకులు హాస్టల్ నిర్వాహకుడు సుధాకర్‌కు సమాచారం అందించారు. ఆయన వెంటనే అక్కడకు చేరకుని పరిశీలించగా కిరణ్‌కుమార్ లుంగీతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించాడు. సుధాకర్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలికి చేరకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి సుందర్‌రావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపార

బెల్టుషాపులపై ఎస్‌ఓటీ పోలీసుల కొరడా

- భారీగా మద్యం పట్టివేత
- పలువురిపై కేసులు

చేవెళ్ల: డివిజన్ పరిధిలోని చేవెళ్ల, శంకర్‌పల్లి, మొయినాబాద్, షాబాద్, మోకిల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి రాజేంద్రనగర్ ఎస్‌ఓటీ ఎస్‌ఓటీ పోలీసులు, స్థానిక పోలీసులు సంయుక్తంగా బెల్టుషాపులపై దాడులు నిర్వహించి భారీగా మద్యం స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేశారు. చేవెళ్ల ఏసీపీ కిషన్ తెలిపిన వివరాల ప్రకారం.. మోకిల పోలీస్‌స్టేషన్ పరిధిలో 10.8 లీటర్ల మద్యం, చేవెళ్ల ఠాణా పరిధిలో మూడు బెల్టుషాపులపై కేసులు 26.21 లీటర్ల మద్యం, మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు కేసులు 22.68లీటర్ల మద్యం, షాబాద్‌లో 48.75లీటర్లు, శంకర్‌పల్లిలో రెండు కేసులు 35.67లీటర్ల మద్యం స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశామని తెలిపారు.

రూ.23వేల విలువైన మద్యం పట్టివేత

యాచారం: ఎల్బీనగర్ ఎస్‌ఓటీ పోలీసులు దాడులు నిర్వహించి అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ సీఐ నర్సింహులు తెలిపిన ప్రకారం.. పోలీస్ స్టేషన్ పరిధిలోని ముచ్చర్లలో బక్క వెంకటేశ్ రూ.23వేల విలువైన మద్యం బాటిళ్లను ఇంట్లో నిల్వఉంచాడు. హోలీ సందర్భంగా విక్రయించి అధిక లాభాలు పొందాలనే దురాశతో వీటిని డంప్ చేసుకున్నాడు. విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు సాయంత్రం తనిఖీలు చేసి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని వెంకటేశ్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌ఓటీ పోలీసుల సూచన మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇద్దరిపై కేసు

మీర్‌పేట: మద్యం విక్రయిస్తున్న బెల్టు షాపులపై మీర్‌పేట పోలీసులు దాడి చేసి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లెలగూడ సాయినగర్‌లో సురేందర్ తన కిరాణాషాపులో మద్యం అమ్ముతుండగా సోమవారం పోలీసులు దాడి చేశారు. రూ.11,700 విలువైన 76 మద్యం బాటిళ్లు, అదే విధంగా నందనవనంలో భారతి ప్రీతి చాంద్ రావు షాపులో రూ.37,700 విలువైన 236 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వీరిద్దరిపై కేసు నమోదు చేశామని సీఐ వెల్లడించారు.

కిరాణాదుకాణంలో అమ్మకాలు

కడ్తాల్: మండల పరిధిలోని ఎక్వాయిపల్లిలో సోమవారం శంషాబాద్ ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసి భారీగా మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన బి.పర్వతాలు, శ్రీను గ్రామంలో కిరాణ దుకాణంతో పాటు, అక్రమంగా బెల్ట్‌షాపు నిర్వహిస్తున్నారు. విశ్వసనీయం సమాచారం అందుకున్న ఎస్‌ఓటీ పోలీసులు ఆయా షాపులపై దాడులు నిర్వహించారు. పర్వతాలు షాపులో 135.64 లీటర్ల లిక్కర్ బాటిల్స్, శ్రీను వద్ద రూ.18వేల విలువైన 31.63 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకుని స్థానిక ఠాణాలో అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉంది.

వెల్జాల్‌లో..

తలకొండపల్లి: మండల పరిధిలోని వెల్జాల్‌లో ఓ కిరాణా షాపుపై పోలీసులు దాడి చేశారు. ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపిన ప్రకారం దుకాణంలో మద్యం అమ్ముతున్నట్లు సమాచారం అందింది. ఈ మేరకు దాడులు నిర్వహించగా 25 బాటిళ్ల లభ్యమైందన్నారు. దుకాణాదారుడు విజయకుమార్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆ నేతలు మనకొద్దు..!

- బీఆర్‌ఎస్ నేతలను చేర్చుకోవద్దని కాంగ్రెస్ నేతల అల్టిమేటం
- కాదని చేరికలను ప్రోత్సహిస్తే పార్టీని వీడుతామని హెచ్చరిక
- రంజిత్‌రెడ్డిని గెలిపించుకునే బాధ్యత మాదేనని వెల్లడి
- సోషల్ మీడియా వేదికగా చర్చలు





వికారాబాద్: చేవెళ్ల బీఆర్‌ఎస్ ఎంపీ రంజిత్ రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పుకున్నది మొదలు అధికార పార్టీలో లుకలుకలు మొదలయ్యాయి. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల వరకు బీఆర్‌ఎస్‌లో ఉన్న రంజిత్ కాంగ్రెస్ అభ్యర్థుల ఓటమి కోసం శ్రమించి ఇప్పుడు హస్తం గూటికి చేరడం, చేవెళ్ల లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ తరఫున బరిలో నిలవడం అధికార పార్టీ శ్రేణుల్లో కలవరం సృష్టిస్తోంది. ఇప్పుడు ఇదే ప్రధాన చర్చనీయాంశంగా మారింది. రంజిత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరడాన్ని స్వాగతిస్తామని, అయితే ఆయన అనుచరులు వస్తే తాము పార్టీని వీడుతామని కొందరు నేతలు తెగేసి చెబుతున్నారు. ఇదే విషయమై సోషల్ మీడియా వేదికగా వికారాబాద్ వాట్సాప్ గ్రూపుల్లో పోస్టులు పెడుతూ చర్చలకు తెర లేపుతున్నారు. రంజిత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరింది మొదలు ఇప్పటి వరకు చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలోని అసెంబ్లీ సెగ్మెంట్లలో పర్యటించలేదు. పరిగి వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో మాత్రం ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఆ సమయంలో పెద్దగా రాజకీయాలపై, ఇతర పార్టీల మీద విమర్శలేమీ చేయకుండానే తాను కాంగ్రెస్‌లో చేరటానికి గల కారణాలను వివరించే ప్రయత్నం చేశారు.

కలిసి పని చేయలేమంటున్న నేతలు

ఎంపీ రంజిత్‌రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పుకున్నది మొదలు ఆయన వెంట ఎవరెవరు నడుస్తారనే విషయంలో ఇటు అధికార పార్టీ తోపాటు ఆటు బీఆర్‌ఎస్‌లో చర్చలు మొదలయ్యాయి. బీఆర్‌ఎస్ ఎంపీగా ఉంటూ జిల్లాను లీడ్ చేస్తూ వచ్చారు. ఒక్క పట్నం మహేందర్‌రెడ్డి మినహా జిల్లాలో బీఆర్‌ఎస్ నేతలను ఒక్కతాటిపైకి తెచ్చేందుకు కృషి చేశారు. పరిగి, వికారాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆయన ప్రభావం ఎక్కువగా కనిపించింది. అందుకేనేమో వికారాబాద్, పరిగి మాజీ ఎమ్మెల్యేలు ఆనంద్, మహేశ్‌రెడ్డి ఇప్పటి వరకు రంజిత్‌రెడ్డి పార్టీ మరినా ఒక్క మాట కూడా అనలేదు. ఇదిలా ఉంటే ఇప్పటి వరకు ఒక్క బీఆర్‌ఎస్ నేత కూడా రంజిత్‌రెడ్డి వెంట నడవలేదు. అనుచరగణం లేకుండా ఆయనొక్కరే సాదా.. సీదాగా కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. రంజిత్‌రెడ్డి అనుచరులు కాంగ్రెస్ పార్టీలో చేరుతారనే ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో అధికార పార్టీ నేతలు ససేమిరా అంటున్నారు. బీఆర్‌ఎస్ నేతలెవరినీ, ముఖ్యంగా ఎంపీ రంజిత్‌రెడ్డి అనుచరులను పార్టీలో చేర్చుకోవద్దని కాంగ్రెస్ నాయకులు తెగేసి చెబుతున్నారు. గ్రామాల్లో వారితో తాము ఇమడలేమని, వారితో కలిసి పని చేయలేమని వారు నేరుగా స్పీకర్ వద్దే చెబుతున్నట్లు సమాచారం. వారిని చేర్చుకుంటే తాము పార్టీ వీడటానికి కూడా వెనుకాడబోమని స్పష్టం చేస్తున్నట్లు తెలిసింది.

సహకరిస్తారా ?

రాజకీయాల్లో ఏదైనా సాధ్యమే అనేది తెలిసిన విషయమే. మొన్నటి వరకు నువ్వా నేనా అనే రీతిలో అసెంబ్లీ బరిలో ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకున్న నేతలు ఇప్పుడు కలిసి పనిచేస్తారా..? అనేది సందేహంగా మారింది. ఓ పక్క బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు ఇప్పటికే ప్రచారం మొదలు పెట్టగా కాంగ్రెస్ మాత్రం వెనుకబడింది. స్పీకర్ హోదాలో ఉన్న వికారాబాద్ ఎమ్మెల్యే కేడర్‌ను పురమాయించగలగారే కానీ ఆయనకున్న పరిమితుల కారణంగా నేరుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొనలేరు. ఈ నేపథ్యంలో రంజిత్‌రెడ్డి స్థానిక కాంగ్రెస్ నేతలతో కలిసి పని చేయాల్సి ఉంది. దీంతో ఆయనకు ఎవరెవరు సహకరిస్తారు..? ఎవరెవరు దూరంగా ఉంటారు అనేది తేలాల్సి ఉంది.